క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌లో తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రైల్వే ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌లో గురువారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైన్యానికి మద్దతుగా కొత్తగూడెం డివిజనల్ మెడికల్ ఆఫీసర్ నాయకత్వంలో రైల్వే ఉద్యోగులు రైల్వే స్టేషన్‌లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మన భద్రత కోసం, మన పోరాటంలో ఆర్మీ సిబ్బందికి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టీఎస్ఆర్ కృష్ణ, స్టేషన్ మాస్టర్ విశ్వనాథ్, అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

జూలూరుపాడు: జాతీయ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 23 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ తేజశ్వని, సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, టీబీ సూపర్‌వైజర్ రఫేల్, హెచ్‌వీ రాధిక, హెచ్‌ఏ కృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ విద్య, అమూల్య, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా భాగ్యరెడ్డి జయంతి

ఇల్లెందు: దళిత అభ్యున్నతి కోసం భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. గురువారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం వద్ద భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకుషావలీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు భాగ్యరెడ్డి జయంతిని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, ఏఈఈ శిరీష, సీనియర్ అసిస్టెంట్ జానీపాషా, ఆపరేటర్లు అరవింద్, జరీనా, విశ్వరూప, కృష్ణకుమారి, భావన తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట సందర్శన

ఇల్లెందు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు అమృత మిత్రలను ఎంపిక చేసి వారితో ఇల్లెందులపాడు చెరువు కట్టను సందర్శించి పరిశీలించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులచే ఎంపిక చేసిన బృందం చెరువు కట్ట మీద 800 మొక్కలు నాటి వాటిని రెండు ఏళ్లపాటు రక్షించే బాధ్యతను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కమిషనర్ మాట్లాడుతూ.. 'చెట్టు కోసం మహిళలు'కార్యక్రమం అమలులో ఉంటుందన్నారు.

నిరుద్యోగులు, నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలి

టేకులపల్లి: రాజీవ్ యువ వికాసం రుణాల్లో నిరుద్యోగులు, నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని, బ్యాంకు ష్యూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేయాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ మీసాల రాములు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయాలకు తావు లేకుండా అధికారులు అర్హులనే ఎంపిక చేసి ప్రజాపాలన నిరూపించాలని తెలిపారు. అభివృద్ధిలో వెనుకబడిన ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

ఆలిండియా సైనిక్‌స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

టేకులపల్లి: ఆలిండియా సైనిక్ స్కూల్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. కోయగూడెం పంచాయతీ దంతెలతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు భూక్యా రమేష్ కుమారుడు షణ్ముఖ్ నాయక్ సీటు సాధించాడు. ఇటీవల ప్రకటించిన నవోదయ, ఏకలవ్య, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లోనూ సీట్లు సాధించాడు. తాజాగా ఆలిండియా సైనిక్ స్కూల్‌లో సీటు సాధించడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. సింగ్యా తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థి, లకావత్ లాలు కుమారుడు సాయి సందీప్ కూడా ఆలిండియా సైనిక్ స్కూల్‌లో సీటు సాధించాడు. ఇటీవల ప్రకటించిన ఏకలవ్యలోనూ సీటు సాధించడం విశేషం.

టీయూడబ్ల్యూజే సంబురాలు విజయవంతం చేయండి..

ఇల్లెందు: ఈ నెల 31వ తేదీతో టీయూడబ్ల్యూజే 25 వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహిస్తున్న రజతోత్సవ సంబురాలు విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే (హెచ్–143) జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం ఇల్లెందు ప్రెస్‌క్లబ్‌లో స్థానిక యూనియన్ సభ్యులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు.

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేదెట్లా..?

- నిర్మాణాలపై అధిక ధరల ప్రభావం
- ప్రకటనలకే పరిమితమైన ఉచిత ఇసుక సరఫరా
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ ఇంటి పథకం సద్వినియోగంతో కలల గూడు సాకారం అవుతుందని పేదలంతా సంబురపడిపోయారు. ఇంటి నిర్మాణ పెట్టుబడి భారంగా ఉన్నా అప్పో సప్పో చేసి నిర్మాణం ప్రారంభించారు. అడుగులు పడుతున్న కొద్ది భారం రెట్టింపవుతూ వస్తోంది. పెరిగిన ధరలకు తోడు సామగ్రి సరఫరాదారుల చేతివాటం వారిని మరింత కుంగదీస్తోంది. నిర్మాణ పురోగతి మినహా లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులు దృష్టి సారించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.

పూబెల్లి గ్రామంలో 83 ఇళ్లు మంజూరు...

ఇల్లెందు మండలంలో నూరుశాతం ఆదివాసీలు ఉన్న పూబెల్లి గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. గ్రామంలో అధికారులు సర్వే నిర్వహించి 83 మందిని అర్హులుగా గుర్తించి ఇళ్లను మంజూరు చేశారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ప్రభుత్వం ఇవ్వనుండగా 600 చదరపు అడుగులలోపే ఇంటిని నిర్మించుకోవాలి. ఇప్పటి వరకు జిల్లాలో 1,600 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాగా ఇప్పటి వరకు 35 ఇళ్లు బేస్‌మెంట్, 57 ఇళ్లు పునాది దశలో ఉన్నాయి. ఇంకా 26 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు.

భారంగా మారిన సిమెంటు ధరలు...

ఒక్క ఇల్లు నిర్మాణం పూర్తయ్యేందుకు దాదాపు 200 బస్తాల సిమెంట్ అవసరం అని అధికారులు ప్రణాళికలో పేర్కొన్నారు. ఇళ్లు మంజూరు చేసిన సమయంలో సిమెంటు బస్తా రకాన్ని బట్టి రూ.230 – రూ.300. ఇటీవల సిమెంటు రూ.50 – రూ.100 వరకు పెరిగాయి. దీంతో విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో లబ్ధిదారుడికి రూ.16వేల నుంచి రూ.20వేల వరకు అదనపు భారం పడుతోంది.

మాటలకే పరిమితమైన ఉచిత ఇసుక..

పూబెల్లి గ్రామంలో మార్చి 16న రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని ప్రకటించారు. కానీ ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో లబ్ధిదారులు భారమైనా గోదావరి ఇసుకను ఒక్కో ట్రాక్టర్ రూ.5,500 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు స్థానికంగా లభించే ఇసుకకు రూ.3వేలు వెచ్చిస్తున్నారు. అంటే ఇంటి నిర్మాణం కోసం ఇసుక పేరుతో ఒక్కో లబ్ధిదారుడు రూ.15వేల – రూ.20వేలు అదనపు ఖర్చు తప్పడం లేదు.

అదనపు ధరలతో ఆగమాగం...

ఇంటి నిర్మాణంలో సిమెంటు, ఇసుకతోపాటు ఇనుము, ఇటుక ధరలు కూడా ప్రాధాన్యం కలిగినవే. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో 12 మీటర్ల ఇనుము 12ఎంఎం గేజ్‌తో రూ.440, 10 ఎంఎం గేజ్‌తో రూ.330, 8 ఎంఎం గేజ్‌తో రూ.230, 6ఎంఎం గేజ్‌తో రూ.100 వరకు ధరలు ఉన్నాయి. కానీ పూబెల్లి గ్రామంలో లబ్ధిదారులకు రూ.10 నుంచి రూ.60 వరకు అదనపు ధరలతో అంటగడుతున్నారు. అంతేకాకుండా ఇటుకల విషయంలోనూ లబ్ధిదారులు అదనపు ధరలు భరించక తప్పడం లేదు. ఇలా అన్నింటి ధరల భారం భరించలేక పూబెల్లి గ్రామంలో 20 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. వారికి అదనంగా రూ.1.30 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు.

ఇసుక ఉచితంగా ఇవ్వాలి..



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పెరిగిన సామగ్రి ధరలు భారంగా మారాయి. ఇసుక ఉచితంగా ఇస్తామంటే కొంతభారం తగ్గుతుందని భావించాం. కానీ నేటికీ ఇసుక కూపన్లు ఇవ్వలేదు. దీంతో ఇసుక కొనుగోలుకు రూ.20వేల వరకు ఖర్చు చేస్తున్నాం. అదనపు భారం ఇబ్బందిగా ఉంది.

– పూనెం అంజమ్మ, పూబెల్లి

సామగ్రి ధరలు పెరిగాయి..



ఇళ్లు నిర్మించుకునేందుకు సామగ్రి ధరలు అధికంగా ఉండటం, మేస్త్రీల కొరత కారణంగా ఇంటి నిర్మాణ బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాం. ప్రభుత్వం మంజూరు చేసే నిధులకు అదనంగా కొంత చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాం. కూలి పనులకు వెళ్లి కొంతైనా సంపాదించుకుంటాం.

– అంగులూరి చిట్టి, పూబెల్లి

ఉచిత సరఫరాకు విన్నవించాం..



పూబెల్లి గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని మండల స్థాయి అధికారులకు పలుమార్లు విన్నవించాం. రెవెన్యూ అధికారుల ద్వారా కూపన్ల పంపిణీ కోసం లేఖ కూడా అందజేశాం. త్వరితగతిన సరఫరా ప్రారంభించేలా కృషి చేస్తాం.

– జి.శంకర్, హౌసింగ్ పీడీ

పచ్చిరొట్టతో అధిక దిగుబడులు



పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం

ఇల్లెందురూరల్: పచ్చిరొట్టతో అధిక దిగుబడులు వస్తాయని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తన విక్రయాలను గురువారం ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల నేల సారాన్ని కోల్పోతుందని, పంట మార్పిడి, పచ్చిరొట్టతో మంచి దిగుబడులు వస్తాయన్నారు.

కార్యక్రమంలో బానోత్ రాంబాబు, మెట్టెల కృష్ణ, పులిగళ్ల మాధవరావు, జనగం కోటేశ్వరరావు, ఏడీఏ లాల్‌చంద్, ఏఓ సతీష్, సీఈఓ హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

19 మంది గైర్హాజరు

పాల్వంచరూరల్: ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఉదయం ఇంటర్ ప్రథమ, సాయంత్రం ద్వితీయ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 364 మందికి 345 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 19 మంది గైర్హాజరు అయినట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్షలను రాష్ట్ర పరిశీలకులు యాదగిరి పర్యవేక్షించారు.

ఆదివాసీ ఆణిముత్యం



లక్ష్మణ్

పాల్వంచరూరల్: అటవీ ప్రాంతం.. కనీసం రోడ్డు, విద్యుత్ లేని సీతారాంపురం గ్రామంలోని వలస ఆదివాసీ గిరిజన బిడ్డ పదో తరగతిలో ప్రతిభ చూపాడు. దంతలబోరు గ్రామపంచాయతీలోని అటవీ ప్రాంతంలో వలస ఆదివాసీ గిరిజనులు నివాసం ఉంటున్న సీతారాంపురం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజనుడు వెట్టి మహేష్ కుమారుడు లక్ష్మణ్ బూర్గంపాడు మండలం ఉప్పుసాకలోని ఎస్టీ హాస్టల్లో పదో తరగతి చదివాడు. ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో 457 మార్కులు సాధించాడు. దీంతో గ్రామంలో ఇంటర్ చదివే మొదటి వ్యక్తి కావడంతో లక్ష్మణ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఓసీ పనులను అడ్డుకుంటాం..



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న నిర్వాసితులు, వివిధ రాజకీయ పక్షాల నాయులు

ఇల్లెందురూరల్: నిర్వాసితులకు ప్యాకేజీ, క్వార్టర్లు, నివాస గృహాల ప్రాంతాన్ని రెవెన్యూకు అప్పగించకుంటే జేకే ఓసీ విస్తరణ పనులను అడ్డుకుంటామని అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో 21పిట్ ఏరియా నిర్వాసితులు గురువారం భారీ ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పబ్లిక్ హియరింగ్, నిర్వాసిత ప్రాంత సర్వేలలో మెరుగైన ప్యాకేజీ ఇస్తామని, క్వార్టర్లలో నివసిస్తున్న వారికి న్యాయం చేస్తామని, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామని అధికారులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నేడు అంతా పూర్తయ్యాక పరిహారం చెల్లించబోమని, క్వార్టర్లలో మరమ్మత్తులకు అవకాశం ఇవ్వమని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో జేకే ఓసీ నిర్వాసితులకు ఇచ్చినట్లుగా ప్యాకేజీ ఇవ్వాలని, క్వార్టర్లు, నివాస ప్రాంతాల భూభాగాన్ని రెవెన్యూకు అప్పగించేలా స్పష్టమైన ప్రకటన చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాల నాయకులు సారయ్య, తాళ్లూరి కృష్ణ, రాసుద్దీన్, సారంగపాణి, సూర్నపాక సత్యనారాయణ, దాస్యం ప్రమోద్, రాంసింగ్, పూనెం కవిత, ధనసరి స్రవంతి, అబ్దుల్ నబీ, పూనెం సురేందర్, వెన్నంపల్లి శ్రీనివాస్, గూళ్ల మొగిలి, సదయ్య, సదరం మహేష్, టి.లాలు, ధనసరి రాజు, మాచర్ల విజయ్, హరిసింగ్, పోతిరెడ్డి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

సుజాతనగర్: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ జి.నర్మద తెలిపారు. స్థానిక రైతు వేదికలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాల డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... రాబోయే వానాకాలం సీజన్‌లో నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయించడానికి వీల్లేదని, పూర్తిగా నిఘా ఉంచామని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. డీలర్లు స్టాక్ రిజిష్టర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని చెప్పారు. కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రశీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీలర్లు కోరబోయిన నాగేశ్వరరావు, పులిజాల శ్రీనివాస్, రామరాజు, బత్తుల రమేష్, సుగ్గల రాము, రవి పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో అర్చకులు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామంలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆవిష్కరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



పాల్వంచరూరల్: పునుకులగ్రామంలో..



టేకులపల్లి: కొప్పురాయిలో..

గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయం



చంద్రాలగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచరూరల్: మారుమూల గిరిజన గుంపులు, గ్రామాల అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చంద్రాలగూడెం, రేగులగూడెం, బంజర, ఉల్వనూరు, మందేరకలపాడు, మొండికట్ట, కారెగట్టు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా రూ.157.5 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మాట్లాడుతూ..

గ్రామీణ ప్రాంతాల్లో తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. పల్లెల్లో ప్రగతి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి...

కేంద్రప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పాలని ఎమ్మెల్యే కూనంనేని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు 27మందిని ఎన్‌కౌంటర్‌ను ఖండించారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ ఎన్‌కౌంటర్లు చేయడం అప్రజాస్వామికం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ దారా ప్రసాద్, పీఆర్ డీఈ రామకృష్ణ, విద్యుత్‌శాఖ ఏడీఈ హుస్సేన్, ఎస్‌కే సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, యర్రంశెట్టి ముత్తయ్య, బరపటివాసు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఎ.సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, కె.వెంకన్న, వీరమోహన్, నిమ్మలరాంబాబు, ఇట్టి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీ కార్మికులకు బోనస్ చెల్లించండి..



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

టేకులపల్లి: కోయగూడెం ఓసీ ఎల్ఎస్ఎన్‌టీబీలో విధులు నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ మరియు ఇతర విభాగాలలో కాంట్రాక్టు కార్మికులకు సుమారు 18 మందికి సింగరేణి ప్రకటించిన లాభాల బోనస్ నేటి వరకు చెల్లించకపోవడం బాధాకరమని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై కేటీసీ మేనేజర్‌ను కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... 18 మంది కార్మికులు బోనస్‌కు అర్హులు అయినప్పటికీ నేటి వరకు చెల్లించలేదని, అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తక్షణమే బోనస్ చెల్లించాలని లేదంటే కేటీసీ పీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొగ్గల లక్ష్మయ్య, సమ్మయ్య, సంపత్, భూక్యా శ్రీను, బానోతు శ్రీను, వస్రాం, మాన్‌సింగ్, యాదగిరి, రత్నాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌ను ఖండించండి..



ఇల్లెందు: నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు



పాల్వంచ: నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం)/పాల్వంచ: నంబాల కేశవరావుతోపాటు మరో 27 మంది ఆదివాసీల బూటకపు ఎన్‌కౌంటర్‌ను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గొని నాగేశ్వరరావు అన్నారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భూమి, భుక్తి, ఈదేశ విముక్తి కోసం ఉన్నత చదువులు చదివి, కుటుంబాలను వదిలి విప్లవోద్యమంలో ప్రయాణం చేశారని పేద ప్రజల, ఆదివాసీల హక్కుల కోసం పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో వి.సురేష్, కిరణ్, క్రాంతి, రాజు పాల్గొన్నారు.

జూలూరుపాడు: సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, ఆదివాసీల బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా గురువారం జూలూరుపాడులో పార్టీ నాయకులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ బలగాలు బూటకపు ఎన్‌కౌంటర్ చేయడం దారుణమన్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏదులాపురం గోపాల్‌రావు, బానోత్ ధర్మా, రాయల సిద్ధు పాల్గొన్నారు.

ఇల్లెందు: మానవులను వేటాడి హతమార్చటం కేంద్ర పాలకులకు తగదని ప్రజాసంఘాలు తీవ్రంగా ఆక్షేపించాయి. గురువారం ఇల్లెందులో మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్, మరో 27 మందిని ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో దారుణంగా హతమార్చటాన్ని నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాఫ్రంట్, ఆదివాసీ ప్రజా సంఘాలు, ఎన్జీ, ప్రజాపంథాల నేతలు కేశవరావుకు జోహార్లు అర్పించారు. రామటెంకి అశోక్, మెంతెన సంజీవరావు, కాంపాటి పృథ్వీ, సారంగపాణి, కొప్పుల గీతారెడ్డి, రమణాల లక్ష్మయ్య, మెంతెన ప్రభాకర్ పాల్గొన్నారు.

టేకులపల్లి: సీపీఐ మావోయిస్టు కేంద్ర కమిటీ జనరల్ సెక్రెటరీ నంబాల కేశవరావును ఒడిషాలో అరెస్ట్ చేసి బూటకపు హత్య చేసి ఎన్‌కౌంటర్ కథ అల్లుతున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి మండల కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎట్టి నరసింహారావు, నోముల భానుచందర్, శంకర్, నర్సింగ్ పాల్గొన్నారు.

విధులకు హాజరుకండి.. సంస్థకు సహకరించండి

- ఆర్థికంగా అభివృద్ధి చెందండి
- అనారోగ్య సమస్యలుంటే రిజైన్ చెయ్యండి
- గైర్హాజరవుతున్న కార్మికులకు సింగరేణి అధికారుల కౌన్సెలింగ్



గైర్హాజరవుతున్న కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాపిత గనులు, డిపార్ట్‌మెంట్లలో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు మైండ్ సెట్ మార్చేందుకు, వారు రెగ్యులర్‌గా విధులకు హాజరయ్యేందుకు యాజమాన్యం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు సింగరేణి వ్యాప్తంగా కార్మికుల ఫ్యామిలీలతో కౌన్సెలింగ్ నిర్వహించింది. వారి కుటుంబ సభ్యులతో చర్చించి గైర్హాజరుకు గల కారణాలు తెలుసుకుంటోంది యాజమాన్యం. కంపెనీలో మీకు ఉద్యోగంతో పాటు, సుమారు 13 రకాల వసతులు కల్పిస్తుంది. తద్వారా పిల్లల చదువులు, మీరు, మీ కుటుంబం సంతోషంగా బతుకుతుంది. అంతేకాకుండా సమాజంలో సింగరేణి ఉద్యోగం అంటే మీకు ఒక స్టేటస్‌ను కల్పిస్తుందని యాజమాన్యం కౌన్సెలింగ్‌లో పేర్కొంది. దీంతోపాటు సంస్థ అభివృద్ధికి మీ సహాయ సహకారాలు ఉండాలని, మీరు ఉద్యోగం చేయకపోతే మీ కుటుంబ పోషణ, పిల్లల చదువుల ఖర్చులు ఇబ్బందిగా ఉంటుందని, ఉద్యోగం చేయకపోతే అప్పుల పాలవటం, దాని వలన సమాజంలో మీ పట్ల వారికి చిన్నచూపు ఉంటుందని, ఒకవేళ మీకు ఆరోగ్యం సరిగా లేకపోతే వైద్యుల ద్వారా సరైన వైద్యం చేయించి మీకు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు చేస్తామని, మీరు చేయవలసిందల్లా మీకు గైర్హాజరు కాకుండా విధులకు హాజరు కావాలని సూచించింది.

ఏడాదికి 100 మస్టర్లు చేయక పోతే డిస్మిస్..

ప్రతీ ఉద్యోగి వారానికి రెండు రోజులు మస్టర్లు, సంవత్సరానికి 100 మస్టర్లు చేయకపోతే కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించటానికి రంగం సిద్ధం చేస్తోంది. నెలకు 8 మస్టర్లు పని చేస్తే కంపెనీ ఇచ్చే పెన్షన్, ఇన్సూరెన్స్‌కు రికవరీకి కూడా సరిపోదు. దీంతోపాటు పిల్లల చదువులు, కుటుంబ పోషణ కష్టసాధ్యం అని యాజమాన్యం భావిస్తోంది.

డిపెండెంట్ ఉద్యోగుల్లో.. సగం మంది గైర్హాజరు..

సింగరేణి సంస్థ కార్మికుల పిల్లలకు ఉద్యోగం కల్పించేందుకు గాను ఆరు జబ్బులు ఉంటే ఇన్‌వాలిడేషన్‌కు 10 జబ్బులు కల్పించి, మొత్తం 16 జబ్బులు జోడించి ఇన్‌వాలిడేషన్ ప్రక్రియ 2018 నుంచి చేపట్టింది. సుమారు 16 వేల మంది మెడికల్ ఇన్‌వాలిడేషన్ కాగా వారిలో 14 వేల మంది ఉద్యోగంలో చేరగా, మిగిలిన రెండు వేల మంది పలు కారణాలతో ఉద్యోగాలు రాక ఇబ్బందిపడుతున్నారు. అయితే ఉద్యోగ వచ్చిన వారిలో 7,481 మంది సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో గైర్హాజరవుతున్నారని అధికారులు చెబుతున్నారు.

390 మంది గైర్హాజరు...



కొత్తగూడెం ఏరియాలో 2,423 మంది మెన్ ఆన్ రోల్‌గా ఉన్నారు. వీరిలో 390 మంది గైర్హాజరవుతున్నారు. వీరికోసం ముందుగా కౌన్సెలింగ్ నిర్వహించాము. కొంతమంది విధులకు హాజరవుతున్నారు. మరికొంత మందికి ఫ్యామిలీతో కౌన్సెలింగ్ నిర్వహించాము. మార్పు వస్తుందేమో చూడాలి.

– శాలేంరాజు, జీఎం, కొత్తగూడెం ఏరియా

కౌన్సెలింగ్‌తో గాడిలో పెట్టాలి..



నాలుగు నెలల్లో 50 మస్టర్లు చేయని కార్మికులను విధుల నుంచి తీసివేయాలనే ఆలోచన కంపెనీకి వచ్చిన నేపథ్యంలో ఐఎన్‌టీయూసీ నాయకులు యాజమాన్యంతో చర్చించి, విధుల నుంచి తొలగించటం సరైంది కాదని, కౌన్సెలింగ్‌తో గాడిలో పెట్టి విధులకు హాజరయ్యే విధంగా చూడాలని చెప్పింది.

– ఎండీ రజాక్, ఏరియా ఉపాధ్యక్షుడు

పైరవీ విధానం రద్దు చేయాలి..



సింగరేణి యాజమాన్యం పైరవీలు ఉన్నవారికి లైట్‌జాబ్, పైరవీ లేకుంటే, అండర్ గ్రౌండ్ జాబ్ విధానం సరైంది కాదు. దీనివలన పాత వారికి ఇబ్బంది కలుగుతోంది. అంతేకాకుండా గనుల్లో కొంత మందిపై పనిభారం పడుతోంది. పైరవీలు లేని వారు విధులకు గైర్హాజరవుతున్నారు.

– రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి